# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

మంగళవారం 14 అక్టోబర్ 2025 పేజీలు 8





స్లాబులు డిమాలిషన్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది..

గాగిల్లాపూర్ డ్రీమ్‌వన్‌లో నిబంధనలు పాటించని అక్రమ నిర్మాణాలు..

# ప్రత్యేక అధికారి ఆదేశించినా..!

# మొక్కుబడి చర్యలేనా..?

- గతంలో మాదిరి గ్యాస్ కట్టర్‌లతో చర్యలేవి టిపిఎస్ సంజునా మేడమ్..
- గాగిల్లాపూర్ బీఆర్ఎస్ నేత పేకమేడపై చర్యలేవి కమిషనర్ సార్..?



పెన్ పవర్ EXCLUSIVE ఎఫెక్ట్

- గాగిల్లాపూర్ డ్రీమ్‌వన్ వెంచర్‌లో హాస్టల్ నిర్వహణకు అక్రమ కట్టడాలు..
- అదనపు అంతస్తులపై చర్యలు సరే..! సెట్‌బ్యాకుల ఆక్రమణపై చర్యలేవి..?
- మున్సిపల్ స్టైల్‌లో బ్రేకర్‌లతో స్లాబులు కూల్చారు బాగుంది.. మళ్ళీ నిర్మిస్తే..?
- బిల్డర్ వెంటనే సులభంగా నిర్మించుకునే విధంగా వెసులుబాటు కల్పిస్తూ చర్యలు..
- మల్లంపేట్, గాగిల్లాపూర్ అక్రమ నిర్మాణాలపై పెన్ పవర్ దినపత్రికలో వరుస కథనాలు..
- నిప్పుల మీద నీళ్ళు చల్లినట్లు.. గాగిల్లాపూర్ డ్రీమ్‌వన్‌లో మాత్రమే చర్యలు..
- మల్లంపేట్ 1100 గజాల అక్రమ కట్టడంపై చర్యలు ఉంటాయా ఉండవా..?
- మల్లంపేట్ చైన్‌మెన్ ఆస్థాన బిల్డర్ అక్రమ నిర్మాణంపై 5 నెలల క్రితం చర్యలు..
- మళ్ళీ నిర్మించి యధేచ్చగా పనులు.. గాగిల్లాపూర్‌లోనూ అదేవిధంగా నిర్మిస్తే..?
- గాగిల్లాపూర్‌లో స్పెషల్ ఆఫీసర్ పోరు పడలేక, సోమవారం ఇష్టంలేని చర్యలా..?

- పర్మిషన్‌లు ఇచ్చుడేనా..!పర్యవేక్షణ అవసరంలేదా..? కొన్నింటిపైనే చర్యలేంటి..?
- వార్తా కథనాలతో అధికారుల దృష్టికి తీసుకెళ్ళిన అక్రమ కట్టడాలు ఎన్ని..?
- సిబ్బంది కూల్చేసింది ఎన్ని..? ముట్టినవి వదిలేసి..! మిగతా వాటిపై చర్యలా..?
- చర్యలు ఔట్ సోర్సింగ్ సిబ్బంది చైన్‌మెన్ లకు అప్పగిస్తే అరకొర చర్యలే ఉంటాయి..
- దుండిగల్ మున్సిపల్ అధికారుల తీరును గమనిస్తున్న స్పెషల్ ఆఫీసర్ సాయినాథ్..
- "పెన్ పవర్" కథనానికి స్పందించి చర్యలకు ఆదేశం..!
- టౌన్‌ప్లానింగ్ అధికారుల ధోరణిలో మార్పు ఇక అసంభవమేనా..?

-2లో

# తమ్ముడినే చంపాడు... పదవి కోసం నన్ను కూడా చంపొచ్చు

**ఎర్రశేఖర్ పై ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన ఆరోపణలు**

- మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ పై ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- ఎమ్మెల్యే పదవి కోసం తనను హత్య చేసే ప్రమాదం ఉందని ఆరోపణ
- సర్పంచ్ పదవి కోసం సొంత తమ్ముడినే చంపారని ఘాటు విమర్శలు
- ఎర్రశేఖర్ చేరికను ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు వ్యతిరేకిస్తున్నారని వెల్లడి
- కావాలనే లీకులు ఇస్తూ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపాటు

-3లో



# బీసీలకు 42% రిజర్వేషన్లపై స్టేను నిలువరించండి

- 50 శాతం పరిమితి నియమం తప్ప... రాజ్యాంగపరమైంది కాదు
- హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేసిన తెలంగాణ ప్రభుత్వం
- సుప్రీంకోర్టులో ఎస్ఎల్‌పీ దాఖలు

-3లో



# ప్రత్యేక అధికారి ఆదేశించినా..! మొక్కుబడి చర్యలేనా..?



మల్లంపేట్ సాయిబాలాజీలో సెట్‌బ్యాకుల ఆక్రమణతో అక్రమ కట్టడం.. చర్యలెప్పుడు..?



గాగిల్లాపూర్ సర్వే నెం.199 ఇండస్ట్రియల్ జోన్‌లో కోటేశ్వరరావు అక్రమ కట్టడం..

**ఏదిఏమైనప్పటికీ దుండిగల్ మున్సిపాలిటీపై సిడిఎంఎ నుండి స్పెషల్ ఆఫీసర్‌గా నియమించబడిన, ప్రత్యేక అధికారి సాయినాథ్ సోమవారం కూల్చివేతల వ్యవహారాన్ని, మరోసారి పరిశీలిస్తే బాగుంటుందని పలువురు కోరుతున్నారు.. అధికారులు లేకుండా, చైన్‌మెన్‌లు కూల్చివేతల్లో చాకచక్యంగా వ్యవహరించి బాల్కానీల వద్ద చర్యలు చేపట్టడం, బిల్డర్‌లకు అధికారుల సహకారంగా చెప్పవచ్చు.. ఎలాగో అధికారుల తీరు మారదు.. స్పెషల్ ఆఫీసర్ మరికొంత చొరవచూపి, చైన్‌మెన్‌ల సెక్షన్ మార్పులు చేయాలని, ప్రమాదకర కట్టడాలను నియంత్రించే దిశగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.**

**దుండిగల్, పెన్ పవర్, అక్టోబర్ 13:** దుండిగల్ మున్సిపల్ పరిధి, "మల్లంపేట్– గాగిల్లాపూర్‌లో" ప్రమాదకర అక్రమ బహుళ అంతస్తుల నిర్మాణాలపై "పెన్ పవర్" దినపత్రికలో వచ్చిన వరుస కథనాలకు, దుండిగల్ మున్సిపల్ "కమిషనర్ అండ్ టౌన్‌ప్లానింగ్ అధికారి నిర్లక్ష్యం వహించినప్పటికీ..? మున్సిపల్ ప్రత్యేక అధికారి సాయినాథ్ మాత్రం స్పందించారు.. అక్రమ నిర్మాణాలపై తక్షణమే చర్యలు చేపట్టాలని, స్పెషల్ ఆఫీసర్ సాయినాథ్ టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు..! అయితే,దుండిగల్ మున్సిపల్ అధికారుల డిక్షనరీలో చర్యలు చాలా అరుదు.. ఇక నాయకుల సిఫార్సులు ఉన్నాయంటే అంతే సంగతులు..! ప్రత్యేక అధికారి సాయినాథ్ ఆదేశాలు అయినందున, గాగిల్లాపూర్ డ్రీమ్‌వన్‌లో మాత్రమే, రెండు స్లాబులు బ్రేకర్‌లతో కూల్చేసి, మమాః అనిపించారు.. ఈ కూల్చివేతల టెక్నిక్‌లో ఆరితేరిన చైన్‌మెన్, బ్రేకర్‌లు తీసుకెళ్ళి, గ్యాస్ కట్టర్‌లు మరిచారు అనుకుంటే పొరపాటు.. ఈ మున్సిపాలిటీలో బిల్డర్‌లను బట్టి, అధికారులు చర్యలు ఉంటాయని ఆరోపణలు ఉన్నాయి.. ఒక్కోసారి ఆ చర్యలు కూడా డౌటేనట.. మల్లంపేట్ సాయిబాలాజీలో చైన్‌మెన్ ఆస్థాన బిల్డర్‌కి చెందిన ఐదంతస్తుల అక్రమ నిర్మాణంపై ఐదు నెలల క్రితం చర్యలు తీసుకున్నారు.. కానీ మరుసటి రోజునుంచే యధావిధిగా పనులు చేపట్టారు.. ఆతర్వాత చర్యల ఊసేలేదు..

## చైన్‌మెన్‌లతో చర్యలు..! అధికారులు గైర్హాజరు..!

దుండిగల్ మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ ఆదేశాలు అంటే..! మున్సిపల్ అధిజారులకు గౌరవంలేదో..! లేకపోతే, అసలు చర్యలంటేనే ఇష్టం లేదో ఏమో కానీ..! గాగిల్లాపూర్ అక్రమ నిర్మాణాలపై చర్యలకు, టౌన్‌ప్లానింగ్ అధికారి లేకుండానే, మొక్కుబడి చర్యలు చేపట్టారు.. పట్టణ ప్రణాళికా విభాగంలో విధులు నిర్వర్తించే, ఔట్ సోర్సింగ్ సిబ్బంది చైన్‌మెన్‌లే చర్యలు చేపట్టారు.. అధికారిక కూల్చివేతల సమయంలో

మున్సిపల్ అధికారుల పర్యవేక్షణలోనే కూల్చివేతలు ఉండాలి.. కానీ మొక్కుబడి చర్యలకు ఎవరైతే ఏంటి అనుకున్నారో ఏమో..! చైన్‌మెన్‌లతోనే చర్యలు ముగించేశారు.. బిల్డర్‌లతో కుమ్మక్కై అర్ధాంతరంగా అసంపూర్తి చర్యలతో వెనుదిరిగారని ఆరోపణలు వస్తున్నాయి..

## చైన్‌మెన్‌ల సెక్షన్ బదిలీ ఏమైంది..?

దుండిగల్ మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్‌లో ఆ చైన్‌మెన్‌లే కీలకంగా మారారు.. టౌన్‌ప్లానింగ్ అధికారి పర్మిషన్‌లు మంజూరు చేసి.. పర్యవేక్షణ బాధ్యత చైన్‌మెన్‌లకు అప్పగిస్తూ, నిబంధనలు పాటించని ప్రమాదకర కట్టడాలకు తెరలేపుతున్నారని విమర్శలు వస్తున్నాయి.. మరోవైపు టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌లో ఒకరిద్దరు చైన్‌మెన్‌ల నిర్వాకంతోనే ఈ ప్రమాదకర అక్రమ కట్టడాలు నిర్మితం అవుతున్నాయని, మల్లంపేట్ సాయిబాలాజీలో 1100 గజాల అక్రమ కట్టడంపై.. సాయిబాలాజీలోనే గతంలో చర్యలు తీసుకున్న ఇద్దరు బిల్డర్‌ల అక్రమ భవనంపై చైన్‌మెన్ ఉదాసీనతతో వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది..



మల్లంపేట్‌లో చర్యలు తీసుకోని అక్రమ కట్టడం..



మల్లంపేట్ కేవిఆర్ వ్యాలీలో అదనపు అంతస్తులు..



చైన్‌మెన్ ఆస్థాన బిల్డర్‌కి సంబంధించిన అక్రమ నిర్మాణం..

# బీసీలకు 42% రిజర్వేషన్లపై స్టేను నిలువరించండి

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ జారీ చేసిన జీవో 9పై స్టే విధిస్తూ హైకోర్టు ఈ నెల 9వ తేదీన జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్పీ) దాఖలు చేసింది. రిజర్వేషన్లపై 50% పరిమితి విధిస్తున్నట్లు రాజ్యాంగంలో ఎక్కడా నిబంధనలు లేకపోయినా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోపై స్టే విధించడాన్ని తప్పుబడుతూ సర్వోన్నత న్యాయస్థానాన్ని రాష్ట్ర సర్కారు ఆశ్రయించింది. "రిజర్వేషన్లను 50 శాతానికి పరిమితం చేస్తూ రాజ్యాంగంలో ఎక్కడా పరిమితులు విధించలేదు. కేవలం సుప్రీంకోర్టు మాత్రమే దాన్నో మార్గదర్శక సూత్రంగా నిర్దేశించింది. అయితే కొన్ని ప్రత్యేక సందర్భాల్లో అంతకుమించి రిజర్వేషన్లు కల్పించవచ్చని ఇందిరా సాహ్నీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా, జనహిత్ అభియాన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసుల్లో సుప్రీంకోర్టు చెప్పింది.

రిజర్వేషన్ల అమలు కోసం ట్రిపుల్ టెస్ట్ నిర్వహించాలని వికాస్ కిషన్‌రావ్ గవ్లీ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో పేర్కొంది. తెలంగాణలో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించే విషయంలో ఆ ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం పాటించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ఎంతమేరకు రిజర్వేషన్లు కల్పించాలన్న అంశంపై సమగ్ర, శాస్త్రీయ అధ్యయనం నిర్వహించింది. సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే 2024-25లో రాష్ట్ర జనాభాలో 56.33% మంది బీసీలు ఉన్నట్లు తేలింది. 42% రిజర్వేషన్ల కల్పనకు అదే ప్రాతిపదిక. రాజ్యాంగంలోని ఆర్టికల్ 342-ఎ(3) కింద దఖలు పడిన అధికారాలను అనుసరించి ప్రభుత్వం ఈ కసరత్తు చేసింది. ఇలాంటి కసరత్తును రాహుల్ రమేశ్ వాఘ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో సుప్రీంకోర్టు సమర్థించింది.సమగ్ర కుల సర్వే తర్వాత తెలంగాణ ప్రభుత్వం రిటైర్ట్ ఐఏఎస్ అధికారి వెంకటేశ్వరరావు నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేసి... ఆ సర్వే డేటాను విశ్లేషించింది. లోతైన అధ్యయనం అనంతరం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాలని ఆ కమిషన్ చేసిన సిఫార్సులను ప్రభుత్వం ఆమోదించింది. దాన్ని అనుసరించి తెలంగాణ బీసీ రిజర్వేషన్ల బిల్లు-2025ను శాసనసభ, శాసనమండలిలో గత మార్చి 17, 18 తేదీల్లో ఏకగ్రీవంగా ఆమోదించి గవర్నర్ ఆమోదం కోసం పంపింది.

**'హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులతో అస్పష్టత'**

రిజర్వేషన్లపై 50% పరిమితి అన్నది కేవలం వివేకపూర్వకమైన నియమం తప్ప అదేమీ రాజ్యాంగపరమైనది కాదని... ప్రత్యేక, క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులు, స్పష్టమైన ఆధారాలు ఉన్నప్పుడు ఆ పరిమితికి మించి కేటాయించేందుకు అనుమతించవచ్చని ఇందిరా సాహ్నీ తీర్పు పేరా 810లో తొమ్మిది మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఇచ్చింది. '50% అనేది సాధారణ నియమం అయినప్పటికీ... దేశంలో వైవిధ్యం, ప్రజల భిన్నత్వాన్ని దృష్టిలో ఉంచుకొని వారసత్వంగా వచ్చిన కొన్ని అసాధారణ పరిస్థితులను విస్మరించకూడదు. మారుమూల ప్రాంతాలు, పల్లెల్లో నివసించే ప్రజలు సాధారణ జనజీవన స్రవంతికి దూరంగా ఉంటారు. వారి పరిస్థితులను వేరుగా చూడాల్సిన అవసరం రావచ్చు. అటువంటి సందర్భాల్లో నియమాల్లో కొంత సడలింపు ఇవ్వాల్సిన అనివార్యత ఏర్పడవచ్చు. అలాంటి సందర్భాల్లో అత్యంత అప్రమత్తతతో వ్యవహరించాలని, దాన్నో ప్రత్యేక కేసుగా పరిగణించాల'ని ఆ తీర్పులో కోర్టు చెప్పింది.

జనహిత్ అభియాన్ కేసు తీర్పులోని పేరా 172లోనూ అలాంటి అంశమే ఉంది. వీటిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లులను అసెంబ్లీ ఉభయసభల్లో ఏకగ్రీవంగా ఆమోదించడం ద్వారా వ్యక్తమైన ప్రజాభిప్రాయాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకొంది. ఈ జీవోను నిలిపివేస్తూ హైకోర్టు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులు అస్పష్టతను ఏర్పరిచాయి. ఒకవైపు జీవోపై స్టే విధించిన హైకోర్టు... మరోవైపు ఎన్నికలపై స్టే విధించడంలో సంయమనం పాటించింది. దీంతో పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలా చేస్తే వెనుకబడిన తరగతుల వారికి సరిదిద్దలేని నష్టం జరుగుతుంది. ఈ నేపథ్యంలో హైకోర్టు ఉత్తర్వులను నిలువరించి, బీసీలకు 42% రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహించుకొనేందుకు అనుమతివ్వండి" అని సుప్రీంకోర్టును రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థించింది.

**'సుప్రీం తీర్పును పరిగణించకపోవడం సరికాదు'**

రాష్ట్ర శాసనసభ, శాసనమండలి మార్చి 17, 18 తేదీల్లో పాస్ చేసి పంపిన బీసీ రిజర్వేషన్ బిల్లులకు గవర్నర్ ఆమోదముద్ర వేయకుండా... మార్చి 30న రాష్ట్రపతి ఆమోదం కోసం పంపారు. దానిపై కేంద్ర హోంశాఖ జూన్ 12న రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరణ కోరింది. వారు అడిగిన అన్ని ప్రశ్నలకూ ప్రభుత్వం జులై 22న సమాధానాలు పంపింది. అయినప్పటికీ ఆ బిల్లులను వెనక్కు పంపడం గాని, ఆమోదించడం గాని చేయలేదు. తమిళనాడు గవర్నర్‌పై ఆ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం... శాసనసభలో ఆమోదించిన పంపిన బిల్లులకు మూడు నెలల్లోపు గవర్నర్/రాష్ట్రపతి ఆమోదం తెలుపకపోతే వాటికి ఆమోదముద్ర వేసినట్లుగానే భావించాల్సి ఉంటుంది. ఈ విషయం పరిగణనలోకి తీసుకోకుండా బీసీ రిజర్వేషన్లపై స్టే ఇవ్వడం సరికాదని తన పిటిషన్‌లో పేర్కొంది.

# తమ్ముడినే చంపాడు... పదవి కోసం నన్ను కూడా చంపొచ్చు

**హైదరాబాద్ పెన్ పవర్:**జడ్చర్ల రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారన్న ప్రచారంపై స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. ఎర్రశేఖర్ ఎమ్మెల్యే పదవి కోసం తనను హత్య చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదని అన్నారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.గతంలో తన సొంత తమ్ముడిని సర్పంచ్ పదవి కోసం హత్య చేశారని అనిరుధ్ రెడ్డి ఆరోపించారు. "అలాంటి వ్యక్తి ఎమ్మెల్యే పదవి కోసం నన్ను చంపడానికి కూడా వెనుకాడడు. ఆయన నుంచి రక్షణ కోసం నేను జెడ్ కేటగిరీ భద్రత కోరాలా?" అని తీవ్ర స్వరంతో ప్రశ్నించారు. ఇప్పటివరకు జడ్చర్లలో ప్రశాంత రాజకీయ వాతావరణం ఉందని, ఫ్యాక్షన్ రాజకీయాలు లేవని ఆయన గుర్తుచేశారు.

ఎర్రశేఖర్ కాంగ్రెస్?లో చేరడాన్ని ఉమ్మడి మహబూబ్?నగర్ జిల్లాకు చెందిన ఏ ఒక్క కాంగ్రెస్ ఎమ్మెల్యే కూడా అంగీకరించరని అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. "ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించడానికి ప్రయత్నించిన వారిని తిరిగి పార్టీలోకి ఎలా తీసుకుంటారు? అలాంటి వారికి కనీసం గేటు దగ్గర అపాయింట్?మెంట్ కూడా దొరకదు" అని అన్నారు. కేవలం మీడియాలో ప్రచారం కోసమే ఎర్రశేఖర్ ఇలాంటి లీకులు ఇస్తూ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

పార్టీకి ద్రోహం చేసిన వారిని తిరిగి చేర్చుకునే విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ నాయకత్వం చాలా స్పష్టమైన వైఖరితో ఉన్నారని అనిరుధ్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కాగా, ఎర్రశేఖర్ గత అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్?లో చేరిన విషయం తెలిసిందే

# సేఫ్ రైడ్ ఛాలెంజ్ ప్రారంభించిన CP సజ్జనార్.. వాహనదారులకు కీలక పిలుపు




**హైదరాబాద్ పెన్ పవర్:**ఇటీవలే హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్?గా బాధ్యతలు చేపట్టిన సీనియర్ ఐపీఎస్ ఆఫీసర్ సజ్జనార్ తన మార్క్ ప్రదర్శిస్తున్నారు. ఇందులో భాగంగానే సోమవారం (అక్టోబర్ 13) సేఫ్ రైడ్ ఛాలెంజ్ అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు సజ్జనార్. పౌరుల్లో బాధ్యతాయుత డ్రైవింగ్ అలవాట్లను పెంపొందించడమే ఈ సేఫ్ రైడ్ ఛాలెంజ్ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం. ఈ ఛాలెంజ్?లో భాగంగా వాహనదారులు తమ ప్రయాణం స్టార్ట్ చేసే ముందు.. బైక్?పై వెళ్లే వారు అయితే హెల్మెట్ ధరించాలి.. కారులో ప్రయాణించే వారైతే సీట్‌బెల్ట్ పెట్టుకోవాలి. ఇలా భద్రతా చర్యలను పాటిస్తూ ఒక చిన్న వీడియో కానీ ఫోటో కానీ తీసి ముగ్గురు స్నేహితులు లేదా కుటుంబ సభ్యులను ట్యాగ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలి.

వారిని కూడా అలాగే చేయమని ఛాలెంజ్ విసిరాలి. అచ్చం చిరంజీవి నటించిన స్టాలిన్ సినిమాలో ఛాలెంజ్ మాదిరిగా అన్నమాట. స్టాలిన్ మూవీలో చిరంజీవి ఒకరికి సహాయం చేసి.. ఆ ఒక్కొరిని మరో ముగ్గురికి.. ఆ ముగ్గురిని మరో ముగ్గురికి సహాయం చేయమని చెప్పినట్లుగా అన్నమాట. సేఫ్టీ ఎప్పుడూ ఫ్యాషన్ అవుట్ కాదని.. మీ ప్రతి ప్రయాణం మిమ్మల్ని, మీకు ఇష్టమైన వారిని రక్షించుకునే నిర్ణయంతో మొదలవుతుందని పేర్కొన్నారు సజ్జనార్. సేఫ్ రైడ్ ఛాలెంజ్ కార్యక్రమంలో వాహనాలు నడిపే ప్రతి ఒక్క పౌరుడు పాల్గొనాలని.. మనం అందరం కలిసి సేఫ్టీని 2025లో కూలెస్ట్ ట్రెండ్‌గా మార్చుదామని వాహనదారులకు పిలుపునిచ్చారు. సజ్జనార్ సేఫ్ రైడ్ చాలెంజ్ కు యువత నుంచి పెద్ద ఎత్తున రెస్పాన్స్ వస్తోంది. వాహనదారులు పెద్ద ఎత్తున సేఫ్ రైడ్ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

# ఫ్యాషన్కు కేరాఫ్ హైదరాబాద్..

- టాలీవుడ్ సింగర్ సునీత

**హైదరాబాద్ పెన్ పవర్:** ధునాతన ఫ్యాషన్ హంగులను అనుసరించడం ఈతరం ట్రెండ్ గా మారిందని ప్రముఖ టాలీవుడ్ సింగర్ సునీత ఉపద్రష్ట అన్నారు. జూబ్లీహిల్స్ లోనీ అతిన రీగల్ వీవ్స్ స్టోర్ ఆధ్వర్యంలో కొత్త షోరూంను ప్రారంభించింది. ఈ స్టోర్ను గాయని సునీత ఉపద్రష్ట ఆవిషరించారు. హైదరాబాద్ నగరం అద్భుతమైన ఫ్యాషన్కు వేదికగా మారుతోందని, ఈ స్టోర్కు సిల్క్ మార్క్ సర్టిఫికెట్ రావటం గొప్ప విషయమని సునీత అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు స్వచ్ఛమైన పట్టు వస్త్రాలు అందించాలనే లక్ష్యంతో అతిన రీగల్ వీవ్స్ ప్రారంభించామని నిర్వాహకులు అనిత, లహరికా, మనశ్వని తెలిపారు.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నిక.. తొలిరోజు 10 నామినేషన్లు.. ఏ ఏ పార్టీల అభ్యర్థులు దాఖలు చేశారంటే..




**హైదరాబాద్ పెన్ పవర్:**జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉపఎన్నిక సందడి మొదలైంది. సోమవారం (అక్టోబర్ 13) నామినేషన్లకు తొలిరోజు కావడంతో ఔత్సాహిక అభ్యర్థులు నామినేషన్లు వేశారు. తొలిరోజు నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు మొదటి రోజు 10 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ వేసిన వారిలో ఇద్దరు రిజిస్టర్ పార్టీల అభ్యర్థులు ఉండగా.. 8 స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ వేశారు. తెలంగాణా పునర్నిర్మాణ సమితి తరపున పూస శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేయగా.. నవతరం పార్టీ నుంచి అర్వపల్లి శ్రీనివాస రావు నామినేషన్ వేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా సిలివేరు శ్రీకాంత్, పెసరకాయల పరీక్షిత్ రెడ్డి, చలిక చంద్ర శేఖర్, సపవత్ సుమన్, వేముల విక్రమ్ రెడ్డి, ఇబ్రహీం ఖాన్ తో పాటు మరో ఇద్దరు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు.

షెడ్యూల్ ప్రకారం 2025, అక్టోబర్ 13వ తేదీన నోటిఫికేషన్ రిలీజ్ చేశారు రిటర్నింగ్ అధికారి. షేక్ పేట్ ఎమ్మార్వో ఆఫీసులో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కూడా ప్రారంభం అయ్యింది. అక్టోబర్ 21వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. 22వ తేదీన దాఖలైన నామినేషన్ పరిశీలన ఉంటుంది. 24వ తేదీ వరకు నామినేషన్ విత్ డ్రా.. ఉపసంహరణకు గడువు ఉంది. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక కోసం నామినేషన్ల స్వీకరణ ప్రారంభం అయిన రోజునే.. సోమవారం ఫస్ట్ నామినేషన్ దాఖలు అయ్యింది. సిలివేరు శ్రీకాంత్ అనే వ్యక్తి రెండు సెట్ల నామినేషన్ పత్రాల దాఖలు చేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నాడు. స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు సిలివేరు శ్రీకాంత్. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి నవీన్ యాదవ్. బీఆర్ఎస్ పార్టీ నుంచి మాగంటి సునీత ఫైనల్ అయ్యారు. బీజేపీ అభ్యర్థి ఎవరు అనేది ఇంకా ఫైనల్ కాలేదు. సిట్టింగ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో ఉప ఎన్నిక జరుగుతుంది. బీఆర్ఎస్ పార్టీ నుంచి గోపీనాథ్ భార్య సునీత బరిలోకి దిగుతున్నారు.

# జూబ్లీహిల్స్‌లో పోరు ప్రారంభమైంది... నిజం, ధర్మం మన వైపు ఉంది: కేటీఆర్

- కాంగ్రెస్ గురించి తెలిసే గత ఎన్నికల్లో హైదరాబాద్ ప్రజలు ఆ పార్టీని గెలిపించలేదన్న కేటీఆర్
- గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన ప్రజలు ఇప్పుడు ఆగ్రహంతో ఉన్నారని వ్యాఖ్య
- అజారుద్దీన్‌కు ఇచ్చిన ఎమ్మెల్సీ కోర్టులో నిలబడదన్న కేటీఆర్




**హైదరాబాద్ పెన్ పవర్:**జూబ్లీహిల్స్‌లో పోరు మొదలైందని, ప్రజలంతా బీఆర్ఎస్ వెంటే ఉన్నారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. నిజం, ధర్మం కూడా బీఆర్ఎస్ పక్షానే ఉన్నాయని ఆయన అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహమత్‌నగర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో కేటీఆర్ ప్రసంగిస్తూ, కాంగ్రెస్ పార్టీ గురించి, రేవంత్ రెడ్డి గురించి హైదరాబాద్ నగర ప్రజలకు బాగా తెలుసని, అందుకే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా దక్కలేదని అన్నారు. అన్ని స్థానాల్లో బీఆర్ఎస్ విజయం సాధించిందని గుర్తుచేశారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన ప్రజలు సైతం ఇప్పుడు ఆగ్రహంతో ఉన్నారని ఆయన పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క ముస్లిం ఎమ్మెల్యే కానీ, ఒక్క ముస్లిం ఎమ్మెల్సీ కానీ లేరని ఆయన విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అజారుద్దీన్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుండి పోటీ చేశారని, ఈసారి కూడా ఆయన టిక్కెట్ ఆశిస్తారని భావించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయనను తప్పించేందుకు కేవలం కాగితంపై 'ఎమ్మెల్సీ' అని రాసి మోసం చేశారని విమర్శించారు. అజారుద్దీన్‌కు ఇచ్చే ఎమ్మెల్సీ నిలబడదని రేవంత్ రెడ్డికి తెలుసని అన్నారు. ఈ విషయం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని ఆయన తెలిపారు. షేక్‌పేటలో కబరస్థాన్‌కు ఇచ్చిన స్థలం కూడా ఆర్మీకి చెందినదని, అది కూడా కోర్టులో నిలబడదని ఆయన అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అని చెప్పారని, అది కూడా కోర్టులో నిలబడలేదని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డికి అన్నీ తెలిసినా ప్రజలను మోసం చేయడానికి ఇలాంటి పనులు చేస్తున్నారని ఆయన విమర్శించారు. బీసీలను, మైనార్టీలను ముఖ్యమంత్రి మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఇక్కడి ప్రజలు గట్టిగా బుద్ధి చెబితే, ఢిల్లీలోని అధిష్ఠానం సైతం ఉలిక్కిపడుతుందని వ్యాఖ్యానించారు.

ప్రజలు మోసపోయి ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం నెలకొందని అన్నారు. దుర్గాదేవిలాగా, కాళికాదేవిలాగా కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతామని ఇప్పుడు ప్రతి మహిళ అంటోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ దొంగ ఓట్లు నమోదు చేయించిందని ఆయన ఆరోపించారు. ఒక ఇంట్లో అయితే ఏకంగా 43 దొంగ ఓట్లు నమోదు చేయించారని అన్నారు. కాంగ్రెస్ ఒక్కో వర్గానికి చాలా బాకీ పడిందని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ బాకీ కార్డును ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. పెన్షన్ పెంపు, మహిళలకు నెలకు రూ. 2,500, నిరుద్యోగ భృతి ఇలా అన్నీ కాంగ్రెస్ బాకీలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు.

# చింతలపూడి మండలంలో అవాంఛనీయ క్రాకర్లు ఉత్పత్తి-నిల్వలపై ప్రత్యేక డ్రైవ్

## ప్రజలకు హెచ్చరిక

హైదరాబాద్ పెన్ పవర్:జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్, చింతలపూడి ు దీపావళి వేళల్లో అనాథరైజ్డ్ క్రాకర్స్ తయారీ సాహసోపేత కార్యకలాపాలపై నియంత్రణకు అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.స్థానిక సీఐ, ఎస్ఐ, రెవెన్యూ సిబ్బందితో కలిసి నిర్వహించిన తనిఖీల్లో అనధికారికంగా క్రాకర్లు తయారు చేసి నిల్వచేసిన ప్రగడవరం మూడు స్థలాల్లో సుమారు ఐదు లక్షల రూపాయుల విలువకు సమీపంగా ఉన్న క్రాకర్లు స్వాధీనం చేసుకున్నారు.ఎవరైనా అనధికారికంగా క్రాకర్లు తయారు చేయకూడదు లేదా నిల్వ చేయకూడదు. అనుభవం లేని వారితో క్రాకర్లు తయారు చేయించకూడదని అధికారులు హెచ్చరించారు.

# చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డి కన్నుమూత



**హైదరాబాద్ పెన్ పవర్:**రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొండా లక్ష్మారెడ్డి కన్నుమూశారు. సోమవారం (అక్టోబర్ 13) తెల్లవారుజామున హైదర్ గూడా అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాలో పనిచేసిన ఆయన మరణవార్త ఇటు పార్టీ శ్రేణులలోనూ, అటు రంగారెడ్డి జిల్లాలోనూ విషాదం మిగిల్చింది.ఎన్ఎస్ఎస్ (%చీూ%) వార్తా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గా, ప్రజాప్రతినిధిగా విశిష్ట సేవలు అందించిన ఆయన 84 ఏళ్ల వయసులో మృతి చెందారు. ఆయన మృతి తీరని లోటు అని పార్టీ నేతలు, చేవెళ్ల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. లక్ష్మారెడ్డి రాజకీయ జీవితం అంతా కాంగ్రెస్ పార్టీతోనే ముడిపడి ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కొండా వెంకట రంగారెడ్డి మనుమడు లక్ష్మారెడ్డి. ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ అధ్యక్షులుగా, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ గ్రీవెన్స్ సెల్ అధికార ప్రతినిధిగా పలు హోదాల్లో పని చేశారు.1999, 2014 లో రెండు పర్యాయాలు లక్ష్మారెడ్డి హైదరాబాద్ లోక్ సభ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. జర్నలిజం పట్ల గల ఆసక్తి, నిబద్ధత కారణంగా 1980లో ఆయన న్యూస్ అండ్ సర్వీసెస్ సిండికేట్(ఎన్ ఎస్ ఎస్ ) అనే ఒక వార్తా సంస్థ ప్రారంభించారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా, జర్నలిస్టుల సహకార గృహ నిర్మాణ సంఘం అధ్యక్షులుగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ కార్యవర్గ సభ్యుడిగా లక్ష్మారెడ్డి సేవలందించారు. మృతి పట్ల ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ ( ఐ జె యు) సంతాపం ప్రకటించింది.

## సీఆర్డీయే కార్యాలయాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు

**హైదరాబాద్ పెన్ పవర్:**రాజధాని అమరావతిలో సీఆర్డీఏ కార్యాలయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. భవనం మొత్తం పరిశీలించారు. అనంతరం సీఆర్డీఏ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ, స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల ఛైర్మన్లు, అధికారులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల అమలుపై పర్యవేక్షణ చేయాలి....



**హైదరాబాద్ పెన్ పవర్:**జిల్లాలో ప్రభుత్వ శాఖల పనితీరు, విద్యా సంస్థలు, వసతి గృహాలు, అలాగే అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాల అమలుపై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో జరిగిన ప్రజావాణి అనంతరం సిబ్బంది బయో మెట్రిక్ హాజరు నమోదు, సంక్షేమ వసతి గృహాల్లో సౌకర్యాలు పర్యవేక్షణ, ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు పరిశీలన, ముందస్తు అనుమతులు లేకుండా సెలవులు వినియోగం తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి శాఖాధికారి ముందస్తు అనుమతి లేకుండా సెలవులలో వెళ్లరాదని సూచించారు. సెలవు కొరకు మెసేజి చేయడం, టప్పాలో సెలవు దరఖాస్తు పంపడం చేయొద్దని నేరుగా కలిసి అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఏ అధికారి సెలవులో వెళ్లారో, ఫీల్డ్ కు వెళ్లారో తెలియడం లేదని పేర్కొన్నారు. అలాగే అన్ని శాఖల సిబ్బంది యొక్క బయోమెట్రిక్ నమోదును ఆధారంగా తీసుకుని వేతనాలు చెల్లించాలని ఆయన స్పష్టం చేశారు. హాజరు సక్రమంగా ఉండేలా ప్రతి అధికారి పటిష్ట పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే పాఠశాలలు, అన్ని శాఖల సంక్షేమ వసతి గృహాలను పరిశీలించి విద్యార్థులకు సందించే ఆహారం, వసతి, పరిశుభ్రత అంశాలను పరిశీలించాలని సూచించారు. విద్యార్థుల హాజరు, బోధనా ప్రమాణాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, ప్రజలకు అందే ప్రయోజనాల సమీక్ష, మరియు ఫీల్డ్ స్థాయిలో పర్యవేక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు.జిల్లా అభివృద్ధి, ప్రజా సేవల విషయంలో ఎలాంటి రాజీ ఉండరాదని, అందరూ సమయపాలన, విధల పట్ల నిబద్ధతతో వ్యవహరించాలని కలెక్టర్ రాహుల్ శర్మ స్పష్టంచేశారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ రవి, ట్రైని డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఒకే అడ్రస్‌పై 43 మంది ఓటర్లు.. ఫేక్ ఓటర్లపై ఈసీ స్పందన ఇదే




**హైదరాబాద్ పెన్ పవర్:**ఎన్డీఏ తో ఎన్నికల సంఘం కుమ్మక్కై ఓట్ చోరీకి సహకరిస్తోందని ప్రతిపక్ష పార్టీలు విమర్శిస్తున్న తరుణంలో హైదరాబాద్ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఫేక్ ఓట్ల అంశం కలకలం రేపింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో ఒకే అడ్రెస్ పై భారీగా ఓటర్లు నమోదైనట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఒకే ఫ్లాట్, ఒకే ఇంటి అడ్రస్ లలో భారీగా ఓట్లు నమోదయ్యాయని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో ఫ్రాడ్ జరిగే అవకాశం ఉందని వివిధ పార్టీలు విమర్శలకు దిగాయి.

ఫేక్ ఓటర్ల నమోదు ఆరోపణలపై జిల్లా ఎన్నికల అధికారి సోమవారం (అక్టోబర్ 13) స్పష్టతనిచ్చారు. ఆరోపణలు వస్తున్నట్లుగా కొత్తగా ఎవరినీ ఓటర్లుగా నమోదు చేయలేదని చెప్పారు. 2023 జనరల్ అసెంబ్లీ, 2024 పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఓటర్ లిస్ట్ లో ఉన్న ఓటర్లే ఇప్పుడు ఉన్నారని తెలిపారు.

ఒక అడ్రెస్స్ పైన ఉన్న అపార్టుమెంట్ లో 15 ఫ్లాట్స్ ఉండటం తో భారీగా ఓటర్లు ఉన్నట్లు కనిపిస్తుందని అన్నారు. 2023 నుంచి అక్కడ ఉన్న ఓట్లే తప్ప కొత్తగా ఓట్లు యాడ్ చేయలేదని తెలిపారు. 8-3-231/%దీ%/160 అపార్టుమెంట్ లో 15 ఫ్లాట్స్ ఉన్నాయని.. ఈ అడ్రస్ పై 43 ఓట్లున్నట్లు తెలిపారు.

### ఉద్యోగాలు రావాలన్నా...పింఛన్లు రావాలన్నా...పథకాలు అమలు కావాలన్నా...

# హైడ్రా ఆగాలన్నా బిఆర్ఎస్ పార్టీ గెలవాలి



**హైదరాబాద్ పెన్ పవర్:**

జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్ నగర్ లోని ఎస్ పీ ఆర్ గ్రాండ్ లో నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక చాలా ముఖ్యమైన ఎన్నిక. యావత్ తెలంగాణ ప్రజలు జూబ్లీహిల్స్ వైపు చూస్తున్నారు. రేవంతు రెడ్డి ప్రభుత్వం ఆరు గ్యారంటీలు వంద రోజుల్లో అమలు చేస్తామని హామిలు ఇచ్చారు. బాండ్ పేపర్లు రాసి ఇచ్చారు. వంద రోజలు కాదు, 7వందల రోజులు దాటినా అమలు చేయడం లేదని అన్నారు. అందుకే రేవంత్ రెడ్డికి జుబ్లిహిల్స్ ఎన్నికల్లో సురుకు తగలాలని ప్రజలు కోరుతున్నారు. కాంగ్రెస్ పార్టీ చిత్తు చిత్తుగా ఓడితే రేవంత్ రెడ్డికి కనువిప్పు కలుగుతుందని రాష్ట్ర ప్రజలు చూస్తున్నారు. లేకుంటే ఆరు గ్యారెంటీలు ఎగ్గొట్టినా, హామీలు అమలు చేయకపోయినా, హైడ్రా పేరిట పేదల ఇండ్లు కూల్చినా నాకే ఓటు వసారు అని రేవంతు అంటడు. ఉద్యోగాలు రావాలన్నా, పింఛన్లు రావాలన్నా, పథకాలు అమలు కావాలన్నా, హైడ్రా ఆగాలన్నా బిఆర్ఎస్ పార్టీ గెలవాలి, మాగంటి సునితా గెలవాలి. రెండేళ్లలో రేవంతు రెడ్డి రాష్ట్రాన్ని అవినీతిమయంగా చేసిండు. కేసీఆర్ ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దితే, అత్యంత అవినీతి రాష్ట్రంగా తయారు చేసిండు. బిల్డింగ్ పర్మిషన్ కు స్క్వేర్ ఫీట్ కు రూ. 75, ఫైనాన్స్ బిల్లు క్లియర్ కావాలంటే 12శాతం కమిషన్ ఇవ్వాలట. ఇళ్లు జాగ, భూముల సమస్యలు పరిష్కారం కావాలంటే 40శాతం భూములు రాసివ్వాలట. మొత్తం పర్సెంటేజీలు డిసైడ్ చేసిండు. ఒకప్పుడు తెలంగాణ అంటే పెట్టుబడులకు స్వర్గధామం. తెలంగాణ ఏ పథకం ప్రారంభిస్తే దేశం మొత్తం ఆ పథకం ప్రారంభించేంది. ఒక రాష్ట్రం ఎట్ల ఉండాలో కేసీఆర్ తయారు చేస్తే, రాష్ట్రం, సీఎం ఎట్ల ఉండగూడదో రేవంతు తయారు చేసిండు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చారు. గాంధీ టోపీలు పెట్టి ప్రజలను మోసం చేసారు. కేసీఆర్ 350 బస్తీ దవాఖానలు ప్రారంభించారు. ఉచితంగా పరీక్షలు చేసే విధంగా డయాగ్నోస్టిక్స్ సెంటర్లు ప్రారంభించారు. రేవంతు ప్రభుత్వం బస్తీ దవాఖానలకు సుస్తీ పట్టించింది. ఆరు నెలలుగా బస్తీ దవాఖానల వైద్య సిబ్బంది జీతాలు చెల్లించడం లేదు, మందులు లేవని అన్నారు.

ఇది మాగంటి సునితమ్మ గెలుపు మాత్రమే కాదు, తెలంగాణ ప్రజల గెలుపు, హైడ్రా బాధితుల గెలుపు, మహాలక్ష్మి రాని అక్కా చెల్లెల్ల గెలుపు, పింఛన్లు రాని అవ్వాతాతల గెలుపు, నిరుద్యోగుల గెలుపు. రేవంతు రెడ్డి ఓడినా ఆయన ముఖ్యమంత్రి పదవి పోదు, ప్రభుత్వం పోదు.

కాని రేవంతు రెడ్డికి అర్థం కావాలె. హైడ్రా పెట్టి పెద్దోళ్ల ఇండ్లు కూల్చుతలేదు గానీ, పేదోళ్ల ఇండ్లు కూల్చుతున్నడు. కేసీఆర్ కిట్ బందు, బతుకమ్మ చీర బందు, రంజాన్ తోఫా బంద్, ఓవర్సీస్ స్కాలర్ షిప్ బందు, దళిత బందు బందు, బీసీ బందు బందు, బస్తీ దవాఖాన ఖతం పట్టించారు. హిందు, ముస్లీం అందరం కలిసి హైద్రాబాద్ ను, తెలంగాణను కాపాడుకోవాలని అన్నారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్ పెన్ పవర్:**మంథని పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మరణించిన వారి కుటుంబాలను, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సోమవారం పరామర్శించారు.

మంథని పట్టణం పరిధిలో కాల్వ బొంద్యాలు అనారోగ్యంతో మరణించగా వారి ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పరామర్శించారు.

అదేవిధంగా మంథని మండల పరిధిలోని విలోచవరం గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాగం శ్రీనివాస్ తండ్రి రాగం సాంబయ్య ఇటీవల మరణించగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గద్దలపల్లి గ్రామంలో అక్కపక గణేష్, అడ్డూరి వెంకటలక్ష్మి,చిత్తారి లక్ష్మీ, కొయ్యల శ్రీకాంత్,తోటపల్లి భూమయ్య లు ఇటీవల మరణించగా వారి గృహాలను మంత్రి శ్రీధర్ బాబు సందర్శించి వారి చిత్రపటాలకి పూలమాలవేసి నివాళులర్పించి వారి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం గ్రామ శాఖ అధ్యక్షులు పులి రవి సోదరుడు పుల్లె సాధయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయనను పరామర్శించి భరోసా కల్పించారు. కాస అజయ్ ఇటీవలే ప్రమాదవశాత్తు బిల్లింగ్ పై నుండి కింద పడి కాల్లు విరుగగా ఆయనను సైతం పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. బిట్టు పల్లి గ్రామంలో గుండేటి రాజమ్మ ఇటీవలే అనారోగ్యంతో చనిపోగా వారి కుటుంబ సభ్యులను సైతం రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పరామర్శించి భరోసా కల్పించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ఆయిల్ ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదల వెంకన్న, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, విద్యుత్ నియంత్రణ మండలి సభ్యులు శశిభూషణ్ కాచే, నాయకులు కొండా శంకర్, మంతెన సత్యం, ఎరుకల ప్రవీణ్, పెంటరి రాజు, తోకల మల్లేష్, అరెల్లి కిరణ్ గౌడ్ లతోపాటు పలువురు పాల్గొన్నారు.

# లక్ష్యంతో చదివితే విజయం వరిస్తుంది




**హైదరాబాద్ పెన్ పవర్:**స్థానిక ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఎంబీఏ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించగా, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా ట్రినిటీ విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్ రెడ్డి హాజరై విద్యార్థులను వారి భవిష్యత్తుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మేనేజ్మెంట్ ఎడ్యుకేషన్ వైపు అడిగేయడం శుభసూచికమని ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల ను ఎంచుకోవడం ఒక తెలివైన నిర్ణయమన్నారు. కళాశాల ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించడం కొరకు ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్ గత 40 ఏళ్ళుగా మారుమూల ప్రాంతంలో చదువుతున్న విద్యార్థులకు సేవలందిస్తూ ఎంతో మంది విద్యార్థుల జీవితాలను స్థిర పడే విధంగా చేస్తుందన్నారు. విద్యార్థులు మొదటి రోజు నుండే ఒక లక్ష్యం ఏర్పరచుకొని ఎప్పటికప్పుడు నూతన సాంకేతికతను నేర్చుకుంటూ క్రమశిక్షణతో చదివి ఉద్యోగ అవకాశాలు పొందే విధంగా ముందుకు వెళ్లాలని ఇప్పుడున్న తరుణంలో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని తల్లిదండ్రులు విద్యార్థుల చదువు పట్ల ఎప్పటికప్పుడు గమనిస్తూ విద్యార్థులను సక్రమమైన మార్గంలో ఉంచేట్టు తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు. తమ కళాశాలలో 15 ఏళ్లకు పైగా అనుభవం కలిగిన అధ్యాపకులచే విద్యార్థులకు బోధన అందిస్తూ విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు పొందే విధంగా కార్యక్రమాల రూపొందిస్తూ ప్రాక్టికల్ నాలెడ్జ్ అందించే విధంగా సెమినార్స్, ఇండస్ట్రియల్ విజిట్స్, క్యాంపస్ ప్లేస్మెంట్స్ కాన్ఫెన్సెస్ ఇలాంటివి విద్యార్థులు అందిస్తామని అన్నారు. తమ కళాశాలపై నమ్మకం ఉంచి సీటు పొందిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్ రెడ్డి , డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ మణి గణేషన్, ఏవో సురేష్, రాజిరెడ్డి, చొప్పరి వంశీ,ఎంబీఏ విభగదిపతి డాక్టర్ ఆరిఫ్, డాక్టర్ రామ్మోహన్ రెడ్డి, సీనియర్ ఆధ్యాపకులు పర్ష రమేష్, శ్రీలత, సాయి శ్రావణి విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వసతి గృహాలకు పంపిణీ చేసే సరుకుల ధరలు పెంచడం హర్షణీయం

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలోని వసతి గృహాలకు సరఫరా చేసే సరుకుల ధరలను పెంచడం హర్షణీయ మని గురుకుల కాంట్రాక్టర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్య క్షుడు కొంకటి లింగమూర్తి, కోశాధికారి భాస్కర్ అనిల్, ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగపురి మనోహర్ తెలిపారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గురుకుల అసోసియేషన్ తరపున ప్రభుత్వానికి వసతి గృహాల సప్లైదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ గౌడ్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఇతర అధికారులకు విన్నవించామని పేర్కొన్నారు. గత జూన్ నుండి వసతి గృహాలకు క్యాటరింగ్ కిరాణ, చికెన్, మటన్, కూరగాయలు పాత రేట్లతోనే వేస్తున్నామని దానివల్ల ఆర్థికంగా నష్టపోతున్నామని ప్రభుత్వానికి తెలియజేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రేట్లు పెంచడం వల్ల కొంత ఉపశమనం కలిగిందని కాంట్రాక్టర్లు వాపోయారు. మార్కెట్లో ఉన్న రేట్ల ప్రకారం మరోసారి పెంచాలని కోరారు. సరుకుల రేట్లు పెంచినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# కఠోర శ్రమ ఉన్నత లక్ష్యాలు

## ఉద్యోగ సాధనకు ఉపకరణాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ సైన్స్ కళాశాల (స్వయంప్రతిపత్తి) కరీంనగర్ టి ఎస్ కె సి ఆధ్వర్యంలో ఇన్ఫోసిస్ ఫౌండేషన్ బెంగళూరు వారి సౌజన్యంతో 30 రోజుల ఉన్నతి ఎంప్లాయిబిలిటీ స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం(13ఆగష్టు 2025నుండి 13 అక్టోబర్2025 ) కార్యక్రమం ముగింపు సమావేశం జరిగింది . ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ కఠోర శ్రమను క్రమశిక్షణతో చేస్తూ ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని ముందుకెళ్ళినటువంటి విద్యార్థులు ఖచ్చితంగా జీవితంలో సఫలీకృతులు అవుతారని సందేశం అందిస్తూ ఇన్ఫోసిస్ వారి సౌజన్యంతో ఈ కళాశాలలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం చాలా సంతోషదాయకమని ఇన్ఫోసిస్ వారికి కృతజ్ఞతలు తెలిపి, ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న విద్యార్థులను అభినందించారు. 32 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ శిక్షణా కార్యక్రమానికి ఉన్నతి ప్రోగ్రాం ట్రైనర్గా వ్యవహరించిన ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ముఖ్యంగా కమ్యూనికేషన్స్ స్కిల్స్, రెస్యూమ్ ప్రిపరేషన్ ఇంటర్వ్యూ స్కిల్స్ ,టైం అండ్ స్ట్రెస్ మేనేజ్మెంట్, డెవలప్మెంట్ ఆఫ్ ఆటిట్యూడ్ డిగ్నిటీ అండ్ సెల్ఫ్ కాన్ఫిడెన్స్ ,లైఫ్ స్కిల్స్ అండ్ గోల్ సెట్టింగ్ అనే అంశాల పైన ట్రైనింగ్ ఇవ్వడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసి సమన్వయకర్త డాక్టర్ హర్జోత్ కౌర్ , టి ఎస్ కే సి సమన్వయకర్త డాక్టర్ బి సతీష్ కుమార్ పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల

**ఈ నెల 21వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ**

**22న నామినేషన్ల పరిశీలన, 24 వరకు నామినేషన్ల ఉప సంహరణ**

**పోలింగ్ వచ్చే నెల 11న పోలింగ్, 14న కౌంటింగ్**

**హైదరాబాద్ పెన్ పవర్:**బీజూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. ఇవాల్టి నుంచి ఈ నెల 21వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం కొనసాగనుంది. 22న నామినేషన్ల పరిశీలన, 24 వరకు నామినేషన్ల ఉప సంహరణ ప్రక్రియ కొనసాగనుంది. ఉప ఎన్నిక పోలింగ్ వచ్చే నెల 11న పోలింగ్, 14న కౌంటింగ్ జరగనుంది. 16న ఎన్నికల ప్రక్రియ పూర్తి స్థా యిలో ముగియనుంది. షేక్‌పేట ఎమ్మార్వో కార్యాలయంలో నామినేషన్లను స్వీకరించనున్నారు. ఇందుకు సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ సన్నద్ధతను ఆర్వో, ఏఆర్వోలతో సమీక్షించారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా ఈసీఐ నిబంధనలకు లోబడి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రిటర్నింగ్ అధికారి సాయిరాంకు సూచించారు.

ఆన్‌లైన్‌లో నామినేషన్ పత్రాలు..

సువిధ పోర్టల్ ద్వారా నామినేషన్లు స్వీకరించే సమయం నుంచి ఆన్‌లైన్ ద్వారా నామినేషన్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకొని, ఆన్‌లైన్‌లోనే వివరాలు నమోదు చేయవచ్చు. అయితే ఆన్‌లైన్ ద్వారా భర్తీ చేసినప్పటికీ స్వయంగా అభ్యర్థి హాజరు కావాల్సి ఉం టుంది. సంతకం, ప్రమాణం కోసం తప్పనిసరి. నామినేషన్ల స్వీకరణ గడువు సమయం ముగిసేలోగా హాజరు కావాల్సి ఉంటుంది. ఇక బీఆర్‌ఎస్ పార్టీ నుంచి మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీతా గోపీనాథ్ బరిలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్ పోటీ చేయనున్నారు. ఇక నేడో రేపో బీజేపీ అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉంది.

# జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ పోటీ చేస్తుందా? లేక మజ్లిస్ పోటీ చేస్తుందా?

**లేక మజ్లిస్ పార్టీ అభ్యర్థి కాంగ్రెస్ సింబల్ మీద పోటీ చేస్తున్నాడా?**

**అనుమానం వ్యక్తం చేసిన బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు**



**హైదరాబాద్ పెన్ పవర్:**ఇప్పుడు అందరి దృష్టి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలపై కేంద్రీకృతమైందని ఇప్పుడున్న పరిస్థితుల్లో జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ పోటీ చేస్తుందా? లేక మజ్లిస్ పోటీ చేస్తుందా? లేక మజ్లిస్ పార్టీ అభ్యర్థి కాంగ్రెస్ సింబల్ మీద పోటీ చేస్తున్నాడా? అన్న అనుమానం కలుగుతోందని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయం లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ, ఇప్పుడున్న కాంగ్రెస్ అభ్యర్థి గతంలో ఎంఐఎం అభ్యర్థిగా పోటీ చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ అభ్యర్థిగా టికెట్ వచ్చిన తర్వాత, నేరుగా ఎంఐఎం అధినేత దగ్గరకు వెళ్లి కాళ్లమీద పడి ఆశీర్వాదం తీసుకున్నారు.దీన్నిబట్టి స్పష్టంగా తెలుస్తోంది.. కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థి ఎంఐఎంకి చెందిన వారే.గతంలో ఎంఐఎం గుర్తు 'పతంగి' మీద పోటీ చేశారు. ఇప్పుడూ ఎంఐఎంకు చెందిన వ్యక్తే, కానీ ఈసారి హస్తం గుర్తు మీద కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నాడు. ఇది ప్రజలను మోసం చేసే చర్యే.ఈరోజు ఎంఐఎం పార్టీ కాంగ్రెస్ మద్దతుతో గెలవాలనే ఆలోచనతో, ఎంఐఎంకు చెందిన అభ్యర్థిని కాంగ్రెస్ టికెట్ మీద పోటీకి దింపుతోంది.ఎంఐఎం%–%కాంగ్రెస్ మధ్య బంధం స్పష్టంగా కనపడుతోంది.గతంలో ఎంఐఎం బీఆర్‌ఎస్ తో కూడా కాపురం చేసింది. ఎంఐఎం మద్దతుతోనే గతంలో సిటీలో బీఆర్‌ఎస్ కొన్ని సీట్లలో గెలిచింది.గతంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం %–% రెండూ కలిసి సిటీని, జీహెచ్‌ఎంసీని నిర్లక్ష్యం చేశాయి.జూబ్లీహిల్స్ లో డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లు సరిగా లేవు. ఒక్క ప్రభుత్వ కార్యాలయం కూడా లేని నియోజకవర్గం జూబ్లీహిల్స్. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి స్పష్టమైన ఉదాహరణ.గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ ను విశ్వనగరంగా చేస్తామని చెప్పి, విషాదనగరంగా మార్చింది.కాంగ్రెస్ పార్టీ గెలిచాక వంద రోజుల్లో హామీలు పూర్తి చేస్తామని చెప్పారు. ఆరు గ్యారంటీలు, 420 వాగ్ధానాలు చేశారు. కానీ ఇంతవరకు నెరవేర్చలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం మాట్లాడేదంతా 420 కేసుల్లానే మిగిలింది.దేశ వ్యాప్తంగా, ఇటు తెలంగాణలో నరేంద్ర మోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం స్పష్టంగా కనపడుతోంది. జూబ్లీహిల్స్ ప్రజలు గమనించాలి.తెలంగాణలో 8 ఎంపీ సీట్లలో బిజెపిని గెలిపించి ఆదరించారు. అదేవిధంగా జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కూడా బిజెపిని గెలిపించాలని కోరుతున్నాను.రేపు అసలైన ప్రతిపక్షంగా, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆగడాలను నిలదీసి, వాటిని అడ్డుకుంటాం.బీఆర్‌ఎస్ కు ఓటు వేస్తే ప్రజలకు లాభం లేదు. ఎందుకంటే ఆ పార్టీలోని నాయకులు ఎవరు ఎప్పుడు ఏ పార్టీలో చేరుతారనేది తెలియదు.కాబట్టి జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బిజెపి అభ్యర్థికి అవకాశం ఇచ్చి, అసలైన ప్రతిపక్షంగా బలపరచి, అసెంబ్లీలో ప్రజావాణిని బలంగా వినిపించేలా బిజెపిని గెలిపించాలని కోరుతున్నాను.ప్రజలు ఇప్పుడు బిజెపి వైపు చూస్తున్నారు. బిజెపి ఖచ్చితంగా జూబ్లీహిల్స్ లో గెలుస్తుందని నమ్ముతున్నాను.జూబ్లీహిల్స్ ప్రజలందరూ రాజకీయ చైతన్యంతో ఆలోచించి, బిజెపికి ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నాను.ఈ కార్యక్రమంలో బిజెపి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కళ్యాణ్ నాయక్ , బిజెపి ఎస్టి మోర్చా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రవి నాయక్ , బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్ , పార్టీ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు , తదితరులు పాల్గొన్నారు.

భారతీయ జనతా పార్టీలో పెద్దఎత్తున చేరికలు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సుపరిపాలన, వికసిత్ భారత్ లక్ష్యంగా చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితులై ఈరోజు భారతీయ జనతా పార్టీలో వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున చేరికలు జరిగాయి. పార్టీలో చేరిన వారికి బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

అందులో భాగంగానే ఈరోజు ఖమ్మం నుంచి డాక్టర్ కాసాని మారుతి గౌడ్రితో పాటు లండన్ నుంచి ఎన్నారై శశి మరియు వారి బృందం బిజెపిలో చేరారు. అదేవిధంగా దేవరకొండ, నాగర్ కర్నూలు నియోజకవర్గాల నుంచి కూడా నాయకులు బిజెపిలో చేరారు.

## కాంగ్రెస్ సంతకాల సేకరణకు మంచి స్పందన

**హైదరాబాద్ పెన్ పవర్:**ఓటర్ల జాబితా అవకతవకలపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ తరపున సంతకాల సేకరణ ఉద్యమం నిర్వహిస్తున్నామని, ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని మాజీ కేంద్రమంత్రి ఎం. ఎం.పళ్లంరాజు తెలిపారు. కాకినాడ రూరల్ నియోజకవర్గం సూర్యారావుపేట గ్రామంలో నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ పిల్లి సత్యలక్ష్మి చిన్న ఆధ్వర్యంలో ఓటర్లు జాబితా అవకతవకలపై గ్రామస్థులకు అవగాహన కల్పించి సంతకాలు సేకరణ చేశారు. ఈకార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లిపూడి రాంబాబు, డీసీసీ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందం, ప్రధాన కార్యదర్శి దాట్ల గాంధీరాజు, ఐఎన్ టీయూసీ అధ్యక్షుడు తాళ్లూరి రాజు, కృష్ణమోహన్, తోకల వరదరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు...

## తెలంగాణలో మూడురోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో మూడురోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బిహార్, జార?ండ్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్, సిక్కిం, ఒడిశా, తెలంగాణలోని పలు ప్రాంతాల నుంచి నైరుతి రుతుపవనాల తిరోగమనం కొనసాగుతుందని వాతావరణశాఖ తెలిపింది. నైరుతి బంగాళాఖాతం, దక్షిణ తమిళనాడు తీరం మీదుగా ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందని పేర్కొంది. ఉత్తర తమిళనాడు తీరం, నైరుతి బంగాళాఖాతంలో సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న ఉపరితల ఆవర్తనం నైరుతి బంగాళాఖాతం, దాన్ని ఆనుకొని ఉన్న దక్షిణ తమిళనాడు తీరం మీదుగా ఉన్న ఉపరితల ఆవర్తనంతో కలిసిపోందని పేర్కొంది.

## ఆర్థిక శాస్త్రంలో ఈ ఏడాది ముగ్గురికి నోబెల్ పురస్కారం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆర్థిక శాస్త్రంలో ఈ ఏడాది ముగ్గురికి నోబెల్ పురస్కారాన్ని ప్రకటించారు. జోయల్ మోకిర్, ఫిలిప్ అఘియాన్, పీటర్ హెూవిట్‌లను ఈ అవార్డు వరించినట్లు ఇవాళ స్టాక్‌హోమ్‌లో నోబెల్ కమిటీ వెల్లడించింది. ఆవిష్కరణలతో జరిగే ఆర్థిక ప్రగతిని ఈ శాస్త్రవేత్తలు వివరించినట్లు నోబెల్ కమిటీ తన ప్రకటనలో పేర్కొన్నది. నోబెల్ పురస్కారంలో సగం బహుమతి మోకిర్ వెళ్లనున్నది. మిగితా సగం ఫిలిప్, హెూవిట్‌లకు దక్కుతుందని కమిటీ తెలిపింది.సాంకేతిక ప్రగతి ద్వారా సాధించే సుస్థిర అభివృద్ధికి కావాల్సిన అంశాలను ఆర్థిక శాస్త్రవేత్త మోకిర్ గుర్తించినట్లు నోబెల్ కమిటీ చెప్పింది. ఇక క్రియేటివ్ డిస్ట్రక్షన్ ద్వారా జరిగే సుస్థిర ప్రగతి సిద్ధాంతాన్ని ఇద్దరు శాస్త్రవేత్తలు అందించినట్లు కమిటీ తన ప్రకటనలో పేర్కొన్నది.

## గూగుల్ యూజర్లకు గుడ్‌న్యూస్.. క్రోమ్ బ్రౌజర్‌లో సరికొత్త ఫీచర్‌ను పరిచయం

**హైదరాబాద్ పెన్ పవర్:** టెక్ దిగ్గజం గూగుల్ యూజర్లకు గుడ్‌న్యూస్ చెప్పింది. కంపెనీకి చెందిన క్రోమ్ బ్రౌజర్‌లో సరికొత్త ఫీచర్‌ను పరిచయం చేసింది. కొత్తగా స్మార్ట్ అలర్ట్ కంట్రోలర్ ఫీచర్‌ను జోడించినట్లు వెల్లడించింది. ఈ ఫీచర్ యూజర్లు చాలాకాలంగా ఇంటరాక్ట్ అవ్వని వెబ్‌సైట్ల నుంచి వచ్చే నోటిఫికేషన్‌లను ఆటోమేటిక్‌గా ఆఫ్ చేయనున్నది. బ్రౌజింగ్‌లో తరుచూ అంతరాయం కలిగించే అనవసరమైన పాప్ అప్ వార్నింగ్స్‌ను తొలగించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది. ఈ అప్‌డేట్‌ను ఆండ్రాయిడ్, డెస్క్‌టాప్ వెర్షన్‌లో విడుదల చేయనున్నది. క్రోమ్ ప్రస్తుతం ప్రైవసీ టూల్స్‌ను మరింత మెరుగుపరుస్తుంది.

## రూ.1.30 లక్షలకు చేరువైన తులం బంగారం

**హైదరాబాద్ పెన్ పవర్:**బీబంగారం ధరలు ఆల్‌టైమ్ హైకి చేరాయి. ఇప్పటికే కనీవినీ ఎరుగని రీతిలో రాకెట్ వేగంతో దూసుకెళ్తున్న పుత్తడి ధర తాజాగా మళ్లీ పెరిగింది. తులం బంగారం రూ.1.30 లక్షలకు చేరువైంది. బంగారంతోపాటూ వెండి కూడా ఆకాశాన్ని తాకుతోంది. ఏకంగా రూ.2లక్షలకు చేరువైంది.

## ఓటు చోరీ కి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

**హైదరాబాద్ పెన్ పవర్:**:కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ఎన్నికల సంఘం కుమ్మక్కై ఓటు చోరీ కి పాల్పడి గత సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి గెలిచి అధికారంలోకి వచ్చిందని ఆరోపిస్తూ,

అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ జువ్వాడి నర్సింగరావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు మండలంలోని మోహన్ రావు పేట్ తోపాటు జోగన్ పల్లి గ్రామాలలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంతం రాజం మాట్లాడుతూ

ప్రజాస్వామ్య రక్షణ కోసం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెరమాండ్ల సత్యనారాయణ, నియోజకవర్గం యువజన కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఏలేటి మహిపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు చిక్యాల కిషన్ రావు, సరికెళ్ళ నరేష్,పూదరి నర్సయ్య, జాగర్ల మహేష్, జాగర్ల రాజయ్య, సంద మహేష్, శనిగరపు రాజయ్య, పత్తిపాక రాజు, శనిగరపు వినోద్, గుండవేణి రాజలింగం, జవుడం మల్లేష్,బొడ్డు మహేష్,నల్ల రాజశేఖర్,మంద శంకర్, బీనవేణి గంగాధర్, అడ్లగట్ట రాజేష్, ఉరుమడ్ల నర్సయ్య, జాన సురేష్,తుక్కయ్య గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## లైసెన్సులు లేకుండా టపాకాయలు విక్రయిస్తే కఠిన చర్యలు..

**హైదరాబాద్ పెన్ పవర్:**:ఆళ్లగడ్డ రూరల్ పోలీస్ సర్కిల్ పరిధిలోదీపావళి పండుగ సందర్భంగా దుకాణదారులు ఎవరైనా లైసెన్స్ లేకుండా బాణాసంచా విక్రయాలు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రూరల్ సీ.ఐ మురళీధర్ రెడ్డి హెచ్చరించారు.సోమవారం తమ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆళ్లగడ్డ రూరల్, చాగలమర్రి, దొర్నిపాడు, ఉయ్యాలవాడ మండలాలలో దీపావళి బాణాసంచా విక్రయాలపై గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ లైసెన్సు పొందిన వ్యాపారులే టపాకాయలను విక్రయాలు చేయాలన్నారు. వ్యాపారస్తులు టపాకాయల విక్రయం కోసం తహసిల్దార్ నుండి అనుమతులు పొందాల్సి ఉంటుందని తెలిపారు.

# మద్యం షాపులకు దరఖాస్తుల వెల్లువ

**హైదరాబాద్ పెన్ పవర్:**:
మద్యం షాపులకు రెండేళ్లకోసారి ఎక్సైజ్ శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. దీనితో తెలంగాణ ప్రభుత్వానికి ప్రధాన ఆదాయవనరుగా ఉన్న మద్యం షాపులకు తెలంగాణ అంతటా దరఖాస్తుల జోష్ కొనసాగుతుంది. తెలంగాణ లోని 2620మద్యం షాపులకు నూతన అబ్కారీ విధానం ప్రకారం టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటి వరకు తెలంగాణ అంతటా 5663 దరఖాస్తులు వచ్చాయి ఈ నెల 18తో దరఖాస్తుల స్వీకరణకు గడువు పూర్తవుతుంది.గత రెండేళ్ల క్రితం మద్యం షాపులకు 1.32 లక్షల దరఖాస్తులు వచ్చాయి. చివరి రెండు రోజుల్లో 45వేల నుంచి 50వేల దరఖాస్తులు వచ్చాయి.13నుంచి 18వరకు సాగే దరఖాస్తుల కు 14మినహా మిగతా తేదీల్లో ఆశజనక దరఖాస్తులు వస్తాయని అబ్కారీ అధికారులు పేర్కొంటున్నారు. చివరి మూడు రోజుల్లో దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్న అంచనాతో అధికారులు అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్సైజ్ డివిజన్ల వారీగా, రంగారెడ్డి, హైదరాబాద్ డివిజన్లలోను, ఉమ్మడి జిల్లాల వారీగా అదనపు కౌంటర్ లు ఏర్పాటుకు ఎక్సైజ్ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.అంతేగాక దరఖాస్తు దారులకు



ఎలాంటి అసౌకర్యాలు కలగ కుండా ఎక్సైజ్ కమిషనర్ సి. హరికిరణ్ పర్యవేక్షణ చేస్తున్నారు. గతంలో లాగా ఈ సారి కూడా ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి దరఖాస్తు లకు వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారని ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వం కేటాయించిన రిజర్వేషన్లకు గౌడ ఎస్సీ ఎస్టీ వ్యాపారాలు కూడా దరఖాస్తులు చేసుకుంటున్నారు గౌడ కులస్తులకు 671, ఎస్సీలకు 202, ఎస్టీ రిజర్వేషన్లు 84, జనరల్ లో4686 దరఖాస్తులు వచ్చినట్టు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. అదిలాబాదులో 142, హైదరాబాదులో 746, కరీంనగర్లో 392, ఖమ్మంలో260, మహబూబ్నగర్లో 278, నల్గొండలో 568, నిజాంబాద్ లో 255, మెదక్లో411, రంగారెడ్డిలో 2353, వరంగల్ లో258 దరఖాస్తులు వచ్చాయి.

# స్థానిక ఉద్యోగుల నియామకాలపైనే దృష్టి

## టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) కీలక ప్రకటన

**హైదరాబాద్ పెన్ పవర్:**:
దేశంలోనే అతిపెద్ద ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) కీలక ప్రకటన చేసింది. హెచ్-1బీ వీసా ఉద్యోగులపై ఆధారపడటాన్ని తగ్గించుకుంటున్నట్లు స్పష్టం చేసింది. స్థానిక ఉద్యోగుల నియామకాలపైనే దృష్టి పెట్టనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు టీసీఎస్ సీఈఓ కె.కృతివాసన్ ఓ మీడియా ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని వెల్లడించారు. అమెరికాలోని టీసీఎస్ సంస్థలో ప్రస్తుతం సరిపడా హెచ్-1బీ ఉద్యోగులు ఉన్నట్లు చెప్పారు. 32,000 నుంచి 33,000 మంది ఉద్యోగులు ఉన్నారన్నారు. అందులో దాదాపు 11 వేల మంది హెచ్-1బీ వీసాపైన వచ్చినవారేనని తెలిపారు. ఇక ఈ ఏడాది ఇప్పటికే భారత్ నుంచి దాదాపు 500 మందిని ఈ వీసాలపై అమెరికాకు పంపినట్లు వివరించారు. ఈ ఏడాది హెచ్-1బీ వీసా కింద కొత్త నియామకాలు చేపట్టే ప్రణాళిక లేదని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ఎల్-1 వీసాల సదుపాయం కూడా ఉందని.. అవి హెచ్-1బీని భర్తీ చేయలేవని వెల్లడించారు.అమెరికా లో ఉద్యోగం చేయాలనుకునే వారికి డొనాల్డ్ ట్రంప్ భారీ షాక్ ఇచ్చిన విషయం తెలిసిందే. విదేశీ నిపుణుల నియామకానికి జారీ చేసే హెచ్-1బీ వీసా దరఖాస్తులపై వార్షిక రుసుంను లక్ష డాలర్లకు పెంచారు. ఈ మేరకు కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేశారు. ట్రంప్ చర్య భారతీయులపై తీవ్ర ప్రభావం పడనుంది.భారత్‌కు చెందిన పలు దిగ్గజ సంస్థలు ఎక్కువగా హెచ్-1బీ వీసాలతోనే అమెరికాలో తమ వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఈ వీసాలతోనే భారతీయుల్ని నియమించుకుంటున్నాయి. ఇందులో అమెజాన్) సంస్థ టాప్‌లో ఉంది. ఆ తర్వాత టాటా కన్సల్టెన్సీ (%ఉజూ%) రెండోస్థానంలో నిలిచింది.యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ డేటా ప్రకారం.. 2024-25 ఆర్థిక సంవత్సరం జూన్ నాటికి అమెజాన్ దాదాపు 10,044 హెచ్-1బీ వీసాలను ఉపయోగించింది. ఆ తర్వాత టీసీఎస్ 5,505, మైక్రోసాఫ్ట్ (5,189), మెటా (5,123), యాపిల్ (4,202), గూగుల్ (4,181), డెలాయిట్ (2,353), ఇన్ఫోసిస్ (2,004), విప్రో (1,523), టెక్ మహీంద్రా అమెరికాస్ (951), ఒరాకిల్ (2,092), అమెజాన్ వెబ్ సర్వీసెస్ (2,347), కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ (2,493), వాల్‌మార్ట్ అసోసియేట్స్ (2,390) హెచ్-1బీ వీసాలను దక్కించుకున్నాయి. ఇవే కాకుండా అమెరికాకు చెందిన పలు కంపెనీలు కూడా హెచ్-1బీ వీసాలతో ఎక్కువమంది భారతీయులను నియమించుకుంటున్నాయి. వాటిపై కూడా తీవ్ర ప్రభావం పడనుంది.